నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 3 మే 2024 | NIZAMABAD



తిమ్మాపూర్‌లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల కార్డును చూపిస్తున్న ఎమ్మెల్యే వేముల

## నాలుగు నెలల్లోనే.. కాంగ్రెస్‌పై
# వ్యతిరేకత మొదలైంది

- అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన హస్తం పార్టీ
- ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెప్పండి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

భీమ్‌గల్/ మోర్తాడ్, మే 2: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీపై నాలుగు నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా భీమ్‌గల్ మండలంలోని సికింద్రాపూర్, గోన్‌గొప్పులతోపాటు మోర్తాడ్ మండలం తిమ్మాపూర్, దొన్కల్‌లో గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోల్లో వేముల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలుచేస్తామని మాటిచ్చి ఇంతవరకూ అమలుచేయకపోవడం ప్రజలను మోసం చేయడమే అని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయామంటూ ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో హస్తం పార్టీకి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఆరు గ్యారెంటీలు, పదమూడు హామీలు అమలుచేయకుండా కాంగ్రెస్, పసుపుబోర్డు ఏర్పాటు చేస్తామని బాండ్‌పేపర్ రాసిచ్చి, ఎర్రజొన్నలు, పసుపు, చెరుకుకు మద్దతు ధర కల్పిస్తామని బీజేపీ మోసం చేశాయని, ఇలా ఒకసారి మోసపోయారని, మరోసారి మోసపోతారా ప్రజలు ఆలోచించాలని సూచించారు. ప్రజలు, రైతులను ఆశల పల్లకీలో మోసుకెళ్లేలా మాటలు చెబుతున్నారని, కానీ వాటిని అమలు చేయలేకపోయారన్నారు. ఎన్నికలు ఉన్న సమయంలోనే రైతుబంధు నాలుగెకరాల వరకు ఇచ్చేందుకు నాలుగు నెలలు పట్టిందని, ఎన్నికల తతంగం పూర్తయితే అదికూడా నిలిపివేస్తారని, ఈ విషయాన్ని రైతులు గుర్తించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఒక్క గ్రామానికి రాలేదని, పనులు కూడా చేయించలేదని, ఇటువంటి వారికి ఓట్లు వేస్తే మనను ఏమనుకుంటారో ఆలోచించాలన్నారు.

**దేవుడి పేరుమీద ఓట్లడగడం సిగ్గుచేటు..**

ఐదేండ్లు ఎంపీగా ఉన్న అర్వింద్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని, మళ్లీ ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడగడానికి గ్రామాలకు వస్తున్నాడని ప్రశ్నించారు. దేవుడు, ప్రధాని మోదీ పేర్లతో ఓట్లు అడగడం సిగ్గుచేటన్నారు. ప్రజల తరపున పోరాడి, ప్రశ్నించే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమే అని పేర్కొన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించా

**నేడు, రేపు మాత్రమే SSC విద్యార్థుల తల్లిదండ్రులకు సువర్ణావకాశం...**

35 సం॥లు పూర్తి అయిన సందర్భంగా నిజామాబాద్ కాకతీయ విద్యాసంస్థ ఇంటర్మీడియట్ మొదటి సం॥ అడ్మిషన్ కోరే విద్యార్థుల తల్లిదండ్రులకు భారీ తగ్గింపు ప్రోత్సాహకాలు నేడు, రేపు మాత్రమే. ప్రతి గ్రూపులో 30 మంది విద్యార్థులకు మాత్రమే సువర్ణావకాశం.
(ముందు వచ్చిన వారికి ముందు సీటు కేటాయింపు ప్రాతిపదిక)

**MPC, BPC & IIT/Medical కోచింగ్‌తో సహా....**

- 10వ తరగతిలో 10/10 గ్రేడ్ వచ్చిన విద్యార్థులకు రెండు సం॥లు మొత్తం కోచింగ్ ఫీజు ఉచితం.
- 10వ తరగతిలో 9.8/10 గ్రేడ్ వచ్చిన విద్యార్థులకు రెండు సం॥లు మొత్తం కోచింగ్ ఫీజులో 60% తగ్గింపు.
- 10వ తరగతిలో 9.7/10 గ్రేడ్ వచ్చిన విద్యార్థులకు రెండు సం॥లు మొత్తం కోచింగ్ ఫీజులో 50% తగ్గింపు.
- ఇలాగే 9.0 నుంచి 9.5 గ్రేడ్ వారికి 35% ఫీజు తగ్గింపు మరియు 8.0 నుంచి 8.9 గ్రేడు వారికి 25% ఫీజు తగ్గింపు ఉంటుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాకతీయ విద్యాసంస్థ చైర్‌పర్సన్ శ్రీమతి CH. విజయలక్ష్మీ తెలిపారు. పూర్తి వివరాలకు సంప్ర॥ **91820 29525, 91775 56270**



ఇటీవల ప్రచారం కోసం వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కాంగ్రెస్ హామీలపై నిలదీస్తున్న గన్నారం గ్రామస్తులు

**కాంగ్రెస్‌కు సెగ..**

మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరుతో జనాన్ని నమ్మించి బురిడీ కొట్టించిన కాంగ్రెస్‌కు లోక్‌సభ ఎలక్షన్లు కత్తి మీద సాములా మారాయి. ఎక్కడికెళ్లినా హామీలపై నిలదీతలే ఎదురవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీకి తలపోటుకు గురిచేసే రెండు సంఘటనలు ఇబ్బందికి గురిచేశాయి. ఇందల్వాయి మండలం గన్నారంలో ప్రచారానికి వెళ్లిన కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే భూపతి రెడ్డికి నిరసన సెగ తగిలింది. ఆరు గ్యారెంటీల అమలు ఏమైందంటూ ప్రశ్నించడంతో కంగు తినాల్సి వచ్చింది. జనాగ్రహాన్ని గమనించి వారిని సముదాయించడానికి నేతల తల ప్రాణం తోకకొచ్చినట్లు అయ్యింది. ప్రచారంలో హస్తం పార్టీకి పలు చోట్ల రైతులు సైతం రైతుబంధు, రుణమాఫీ, వరికి రూ.500 బోనస్, మహిళలకు రూ.2500 నగదు, పింఛన్లు రూ.4వేల అమలుపై ప్రశ్నల వర్షం ఎదురవుతుండడం గమనార్హం. కేసీఆర్ హయాంలో రెంజల్ నుంచి బ్రాహ్మణపల్లికి తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పనులు కూడా ప్రారంభమయ్యాయి. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పనులు నిలిచిపోయాయి. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు రెంజల్‌లోని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ వల్లే ఆగిపోయిన పనులను వెంటనే ప్రారంభించకపోతే తగిన బుద్ధి చెబుతామంటూ హెచ్చరించారు. దీంతో దిగివచ్చిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని ప్రకటించాల్సి వచ్చింది. ఇలా ఎక్కడికక్కడ జనం జాతీయ పార్టీలను నిలదీస్తుండడంతో జవాబు చెప్పలేక అభ్యర్థులు సతమతమవుతున్నారు. ఆయా పార్టీల ముఖ్య నాయకులు సైతం నోరు విప్పేందుకు జంకుతున్నారు. పోలింగ్‌కు గడువు సమీపిస్తుండడం, ప్రచారానికి వెళ్తే పరాభవం ఎదురవుతుండడంతో కాంగ్రెస్, బీజేపీ దిగువ స్థాయి నాయకత్వానికి పాలుపోవడం లేదు.




రెంజల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

# జనాగ్రహం

## కాంగ్రెస్, బీజేపీలను నిలదీస్తున్న ఇందూరు

నిజామాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ఎన్నికల ముందర మభ్యపెట్టి మోసగించిన పార్టీలకు ప్రజలు షాక్ ఇస్తున్నారు. హామీలు ఏమయ్యాయని ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. ఓట్ల కోసం మళ్లీ వస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. మొన్న ఇందల్వాయిలో ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ లోకసభ అభ్యర్థి జీవన్‌రెడ్డిని జనం నిలదీశారు. పింఛన్లు, రుణమాఫీ సహా మిగతా హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. అలాగే, బీజేపీ పరిస్థితి కూడా ఇంతే ఉంది. గత ఎన్నికల్లో పసుపుబోర్డు పేరిట వంచించిన ఎంపీ, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌పైనా రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. దానికి తోడు వివాదాస్పద వ్యాఖ్యలతో, అహంకారపూరిత వైఖరితో వ్యవహరిస్తున్న అర్వింద్‌పై రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతున్నది. మొన్న మెండోరా మండలంలో ఓ వర్గం వారి విషయంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. దీంతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎంపీని అడ్డుకున్నారు. ఇక, జర్నలిస్టులతో వ్యవహరించిన తీరుపైనా విమర్శలు వెల్లువెత్తాయి. ఇలా ఎక్కడకు వెళ్లినా బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులకు పరాభవమే ఎదురవుతున్నది. ఈ మధ్య కాలంలో చోటుచేసుకున్న జాతీయ పార్టీల నిలదీతల పర్వం ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైంది.

- ఎక్కడికెళ్లినా తప్పని నిరసనలు
- ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీతలు
- ఆరు గ్యారెంటీలపై సూటిగా ప్రశ్నిస్తున్న జనం
- సమాధానం చెప్పుకోలేక కాంగ్రెస్ సతమతం
- అర్వింద్ వైఖరిపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- 'పసుపుబోర్డు'తో మోసగించిన వైనంపై రైతుల్లో అసహనం
- ముప్కాల్‌లో ఎంపీని నిలదీసిన మహిళలు

**బీజేపీ అభ్యర్థిపై ఆగ్రహం..**


ఎంపీగా గెలిచిన నాటి నుంచి వివాదాస్పద వ్యాఖ్యలతో నిత్యం సోషల్ మీడియాలో కనిపించే అర్వింద్ తీరు మరోసారి చర్చనీయాంశమైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండగా చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. కానీ ఇవేవి పట్టని బీజేపీ ఎంపీ మాత్రం మొన్న మెండోరా మండలంలో ఓ వర్గాన్ని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. అన్ని చోట్ల తన మాటే చెల్లుబాటు అవుతుందని భావిస్తూ వచ్చిన ఎంపీకి ఓ వర్గం మహిళల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మా మనోభావాలను దెబ్బతీస్తూ వ్యాఖ్యలు చేస్తావా? దేవుడు ఎవకరికైనా ఒకటే కదా? అని మహిళలంతా అర్వింద్‌ను నిలదీశారు. మరోవైపు, ఓ వర్గాన్ని రెచ్చగొట్టేలా వ్యవహరించిన ఎంపీపై చర్యలు తీసుకోకపోవడంపై చర్చ జరుగుతున్నది. జిల్లా ఎన్నికల అధికారి హోదాలో ఉన్న కలెక్టర్, ఎన్నికల పరిశీలకులుగా వచ్చిన ఐఏఎస్ అధికారులు మాత్రం ఈ వ్యవహారాన్ని పట్టించుకోకపోవడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై కనీసం ఎంపీకి సంజాయిషీ నోటీసు ఇవ్వకపోవడంపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల బరిలో నిలిచిన అర్వింద్‌ను ఈసీ బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేస్తూనే ఉన్నా.. మెండోరా ఘటనపై స్పందన కరువైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**జర్నలిస్టుల్లో చులకన..**

గత నెలన్నర వ్యవధిలో పలువురు జర్నలిస్టులపై ఎంపీ అర్వింద్ నోరు పారేసుకున్నారు. ప్రెస్‌మీట్‌కు ఆహ్వానాలు పంపించి, కవరేజీకి వచ్చిన వారిపై నోటికొచ్చినట్లుగా మాట్లాడడంతో జర్నలిస్టుల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నది. సార్వత్రిక ఎన్నికల అంశంపై ఓ సీనియర్ జర్నలిస్టు ఇంటర్వ్యూ చేస్తున్న సమయంలో అసహ్యంగా మాట్లాడిన తీరు వివాదాస్పదమైంది. దీక్షలో ఉన్న సదరు జర్నలిస్టుపై అర్వింద్ వ్యవహరించిన తీరు సోషల్ మీడియాలో వైరల్ అయింది. చివరకు ఎన్నికల వేళ ముప్పు ఏర్పడుతుందని భావించి అర్వింద్ స్వయంగా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అంతకుమునుపు కూడా ప్రెస్‌మీట్‌లో ప్రశ్నలు అడిగిన పలువురికి ఇదే తీరులో పరాభవం ఎదురైంది. ఒకరిద్దరు కాకుండా పలువురు విలేకర్లు సైతం ఎంపీ బాధితులుగా మారారు. ప్రెస్‌మీట్ అంటేనే ప్రశ్నల పరంపరను ఎదుర్కొనడం. కానీ ప్రతికూల ప్రశ్నలు ఎదురైనప్పటికీ సవ్యంగా, ఓపికగా సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత నేతల ధర్మం. ఎంపీ అర్వింద్ ఈ మౌలిక ధర్మాన్ని మరవడంపై వివిధ సంఘాలు సైతం తీవ్రంగా ఖండించగా, నిజామాబాద్ ప్రెస్‌క్లబ్ వాట్సాప్ గ్రూపుల్లోనూ ఎంపీ వైఖరిపై చాలా మంది దుమ్మెత్తి పోశారు.



బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు



రోడ్‌షోలో మాట్లాడుతున్న పోచారం. పక్కన గాలి అనిల్‌కుమార్, జాజాల సురేందర్

## అబద్ధాల కాంగ్రెస్‌కు
# బుద్ధిచెప్పాలి

- ఆరు నెలలైనా అమలుకాని హామీలు
- స్వలాభం కోసమే బీబీ పాటిల్ పోటీ
- పదేండ్లలో ఆయన చేసిందేమీలేదు
- కొత్త నాయకులను తయారుచేస్తాం
- మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం

గాంధారి, మే 2: అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓటుతోనే బుద్ధి చెప్పాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. గాంధారిలో గురువారం సాయంత్రం నిర్వహించిన రోడ్‌షోతోపాటు కార్నర్ మీటింగ్‌లో జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ప్రజలకు మాయమాటలు చెప్పి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాడన్నారు. గెలిపిస్తే వంద రోజుల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని మాటిచ్చాడని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా అమలుచేయడంలేదని మండిపడ్డారు. జహీరాబాద్ ఎంపీగా పదేండ్లు పనిచేసిన బీబీ పాటిల్, ఐదేండ్లు ఎంపీగా ఉన్న సురేశ్‌షెట్కార్ నియోజకవర్గానికి చేసిందేమీలేదన్నారు. ప్రజల నుంచి ఓట్లు వేయించుకోవడం, వ్యాపారాలు చేసుకోవడం బీబీపాటిల్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. స్వలాభం కోసం ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆయనకు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. ప్రజలను విస్మరించిన వ్యక్తులకు ఓటుతోనే సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. నాయకులు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చిన నష్టమేమీ లేదని కొత్త నాయకులను తయారుచేస్తామన్నారు. కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉంటారని అన్నారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల సంక్షేమం కోసం పథకాలను అమలుచేసినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రైతులను రాజు చేయడానికి రైతుబీమా, రైతుబంధు వంటి పథకాలను అమలుచేసినట్లు చెప్పారు. జహీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తిని ఆశీర్వదించాలన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటా: గాలి**

కార్యకర్తలు కష్టపడి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని జహీరాబాద్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ కోరారు. తన గెలుపు కోసం కృషిచేసిన ప్రతి కార్యకర్తనూ గుండెల్లో పెట్టుకుంటానని అన్నారు. దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు కార్యకర్తలే పెద్ద బలమని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. కొందరు నాయకులు బయటికి వెళ్లిపోయినా పార్టీకి జరిగే నష్టమేమి లేదని, కొత్త నాయకులను తయారు చేస్తామని పేర్కొన్నారు. గాంధారి మండలాన్ని దత్తత తీసుకున్న బీబీ పాటిల్ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతాడని ప్రశ్నించారు. గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలని కోరారు.

## నేటి నుంచి
# 'ఇంటి నుంచే ఓటు'

కంఠేశ్వర్, మే 2 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నేటి నుంచి 'ఇంటి నుంచే ఓటు' (ఓట్ ఫ్రం హోం) సదుపాయం అందుబాటులోకి రానున్నది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకునిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఈ నెల 3 నుంచి 6 వరకు హోమ్ ఓటింగ్ నిర్వహించేలా అవసరమైన ఏర్పాట్లు చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజావ్‌గాంధీ హన్మంతు తెలిపారు. పార్లమెంట్ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1758 మంది ఓట్ ఫ్రం హోమ్ సదుపాయాన్ని వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. వీరిలో 85 ఏండ్లకు పైబడి సీనియర్ సిటిజన్ ఓటర్లు 859, దివ్యాంగ ఓటర్లు 899 మంది ఉన్నారని తెలిపారు. ఈ మేరకు 50 హోమ్ ఓటింగ్ బృందాలను ఏర్పాటుచేసి ఓటు సేకరణ ప్రక్రియపై శిక్షణ అందించినట్లు పేర్కొన్నారు. హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకుని అర్హత పొందిన ఓటర్లు వారికి కేటాయించిన తేదీల్లో ఇంటివద్ద అందుబాటులో ఉంటూ ఓటు హక్కును వినియోగిచుకోవాలని కోరారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అత్యవసర విభాగాలకు చెందిన మరో 86 మంది సైతం పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



# అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్

- ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధిచెప్పండి
- ఆశీర్వదించండి.. మీ కుటుంబ సభ్యుడిలా ఉంటా
- బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

ఆర్మూర్ టౌన్, మే 2: అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలనూ మోసం చేసిందని నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ఆ పార్టీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్నూరుకాపు సంఘంలో గురువారం నిర్వహించిన మున్నూరుకాపు కులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. అలవికాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులకు పాలన ఎలా చేయాలో తెలియదని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేసిందని గుర్తుచేశారు. కారు గుర్తుకు ఓటు వేసి, తనను మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## కామారెడ్డిలో త్వరలో
# కేసీఆర్ రోడ్‌షో

కామారెడ్డి, మే 2: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కామారెడ్డి జిల్లా కేంద్రంలో త్వరలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని జేపీఎన్ రోడ్డు వద్ద రోడ్‌షో నిర్వహించనున్న స్థలాన్ని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, జాజాల సురేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ గురువారం పరిశీలించారు.

# పోలింగ్ సమయం పెంపు

- సాయంత్రం 6గంటల వరకు ఓటింగ్: కలెక్టర్

కంఠేశ్వర్, మే 2: వేసవి తీవ్రత, పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదు కావడం వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని, వివిధ వర్గాల వారి అభ్యర్థన మేరకు లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ సమయాన్ని గంట పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసిందని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. పోలింగ్ సమయం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండగా.. 6 గంటల వరకు పెంచినట్లు పేర్కొన్నారు. దీంతో ఉద్యోగులు, వ్యాపారులు కార్మికులు అన్ని వర్గాల ప్రజలు ఓటింగ్ ప్రక్రియలో అధిక సంఖ్యలో పాల్గొని, ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం లభించినట్లు తెలిపారు. ఈ నెల 13న ప్రతిఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.




# రూ.10 లక్షల విలువైన సిగరెట్ల చోరీ

కామారెడ్డి, మే 2 : జిల్లా కేంద్రంలో గురువారం తెల్లవారుజామున సిగరెట్ల కంపెనీలో చోరీ జరిగినట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. గంజ్ మార్కెట్‌లో ఉన్న శ్రీరాఘవేంద్ర ట్రేడర్స్ అనే సిగరేట్ల కంపెనీలో తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కంపెనీలోకి చొరబడి ఎనిమిది కాటన్ల సిగరేట్ డబ్బాలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని తెలిపారు. కంపెనీ యజమాని శశిధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.